ఆలయ 14వ వార్షిక పూజలు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ వి. రామారావు నగర్‌లోని విఘ్నేశ్వర, శివపార్వతి ప్రసన్నాంజనేయ, నవగ్రహ, నాగదేవత ఆలయ 14వ వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఆలయ ఆవరణలోని ఉప ఆలయల్లోని దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. బీఆర్‌ఎస్ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నాగుల సత్యం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సుభాష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి యాదగిరి, కోశాధికారి బాలయ్య, మార్కెట్ కమిటి డైరెక్టర్ నరసింహ, సభ్యులు సాంబశివ, కిష్టయ్య, గిరి తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న బండి రమేష్

కూకట్‌పల్లి: వివేక్‌నగర్‌కు చెందిన యాదగిరికి రూ.1.50 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును బాధితుడి కుమార్తె రీతుకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ శుక్రవారం అందజేశారు. సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలను అన్ని విధాలా ఆదుకుంటాం

ఓల్డ్ బోయిన్‌పల్లి: ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని ఆర్‌ఎంపీలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని విధాలుగా ఆదుకుంటామని టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి అన్నారు. ఈనెల 18న 33 జిల్లాల ఆర్‌ఎంపీలు ఇందిరా పార్కు వద్ద మహాధర్నా నిర్వహించారు. పీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మద్దతు తెలిపి మాట్లాడారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో శుక్రవారం హస్మత్‌పేట చౌరస్తాలో ఆర్‌ఎంపీలు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ప్రొఫెసర్ కోదండరాం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జునయాదవ్, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అరుణ్‌రెడ్డి, నాయకులు శ్రీరాములు, వెంకటేశ్, మహేష్, ఆర్‌ఎంపీలు రాజా గట్టు, రాజేంద్ర, భీమ్‌రావు, నాగేందర్, లతీఫ్, రాజశేఖర్, రాజు, అరవిందస్వామి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య



నితిన్ (ఫైల్)

మూసాపేట: ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి..వరంగల్ జిల్లా, కొండూరు గ్రామానికి చెందిన సోదరులు కిషోర్, నితిన్ కూకట్‌పల్లిలోని దయార్‌గూడలో స్నేహితులతో కలిసి గది అద్దెకు తీసుకుని ఉంటున్నారు. వారం రోజుల క్రితం వారందరూ స్వగ్రామానికి వెళ్లారు. నితిన్ (27) ఒక్కడే గదిలో ఉన్నాడు. శుక్రవారం కుటుంబ సభ్యులు పలు మార్లు ఫోన్ చేసినా నితిన్ స్పందించకపోవడంతో కిశోర్ తన స్నేహితుడు సాయికిరణ్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. అతను గదికి వెళ్లి చూడగా నితిన్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. మృతుడి తండ్రి ఉపేందర్ ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వీఎన్‌ఆర్ కళాశాలలో కన్వర్జెన్స్ 2కె25 ప్రారంభం

నిజాంపేట్: భారతదేశంలో ఇంజినీరింగ్ రంగంలో పురోగతి ఉన్నా కొన్ని విడి భాగాల కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సి వస్తుందని స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ మెటీరియల్స్ అండ్ స్ట్రాటెజిక్ ఇనిషియేటివ్స్ విభాగ ఉపాధ్యక్షులు డాక్టర్ సీవీఎస్ కిరణ్ అన్నారు. ప్రగతినగర్‌లోని వీఎన్‌ఆర్ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న కన్వర్జెన్స్ 2కె25 వార్షిక సాంకేతికోత్సవం శుక్రవారం ప్రారంభమైంది. కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. విధానాలతో మాత్రమే చైనా వంటి దేశాలతో పోటీ పడే స్థాయికి అందుకోగలమన్నారు. నగరంలోని వివిధ కళాశాలల నుంచి సుమారు 1500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన జ్యోతి ప్రధాన కార్యదర్శి కోడె దుర్గా ప్రసాద్, సంస్థ పూర్వాధ్యక్షులు డీఎన్‌రావు, డీన్ డాక్టర్ వై.పద్మాశాయి, ప్రధానాధ్యక్షులు సీడీ నాయుడు, సంచాలకులు బి.చెన్నకేశవ రావు, సభ్యులు కె.హరిశ్చంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు నీడలో..

ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల వద్ద చెత్తకు నిప్పు

- అంటుకుంటున్న తీగలు
- ఇటీవలే తప్పిన ఓ ప్రమాదం

చెత్త కుప్పలను జన సంచార ప్రదేశాల్లో, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ వైర్లకు అతి సమీపంలో కాల్చి వేస్తున్నారు. దీంతో ప్రమాదం పొంచి ఉంది. ఉన్నతాధికారులు చెత్తను కాల్చవద్దని ఆదేశిస్తున్నా కింది స్థాయి సిబ్బంది పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తాము చెత్తను కాల్చడం లేదని, స్థానికులే కాల్చుతున్నారని జీహెచ్‌ఎంసీ సిబ్బంది, లేదు స్థానికులే కాల్చుతున్నారని సిబ్బంది ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకుంటున్నారు. ఏది ఏమైనా నిర్లక్ష్యమే పెను ప్రమాదం కాకుండా సమన్వయంతో చెత్తను తగలబెట్టకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ఆస్‌బెస్టాస్ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద..

ఆల్విన్‌కాలనీ: చెత్తను జీహెచ్‌ఎంసీ రిక్షా, ఆటో కార్మికులు సేకరిస్తున్నారు. అయినప్పటికి కొంతమంది ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తున్నారు. కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు హెచ్చరిస్తున్నప్పటికీ విద్యుత్ స్తంభాలు, నాలుగు కూడళ్ల వద్ద, నాలాల వెంట పడేస్తున్నారు. ఉదయం ఎవ్వరూ లేవక ముందే గుట్టు చప్పుడు కాకుండా కాలుస్తున్నారని తద్వారా విద్యుత్ స్తంభాలకు ఉన్న వైర్లకు అంటుకొని వైర్లు కాలి ఇళ్లలోని విలువైన వస్తువులు కాలిపోతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆదేశాలు బేఖాతర్

చెత్తను కాల్చవద్దని ఉన్నాతాధికారులు ఆదేశించినా జీహెచ్‌ఎంసీ కింది స్థాయి సిబ్బందిలో మార్పు రావడం లేదు. కాలనీల్లో చెత్తని ఎప్పటికప్పుడు తరలించకుండా ఒక ప్రదేశంలో వేసి కాలుస్తున్నారు. ఎన్నిసార్లు హెచ్చరించినప్పటికీ వారిలో మార్పు రావడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. చెత్తను, కుళ్లిన పదార్థాలను ఇళ్ల పరిసర ప్రాంతాల్లో కాల్చడం వల్ల దట్టమైన పొగతో పాటు దుర్గంధంతో కూడిన దుర్వాసన వల్ల వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి..

ఆల్విన్‌కాలనీ ఫేజ్ 1లోని సాయి ఫంక్షన్ హాల్ వెనుక వీధిలో ఓ విద్యుత్ స్తంభం వద్ద చెత్తకు నిప్పంటించారు. మంటల వ్యాపించి గృహాలకు సంబంధించిన విద్యుత్ వైర్లు కాలాయి. మంటలు వ్యాపిస్తుండటంతో స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి, విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు చేరుకొని మంటలను ఆరివేశారు. అప్పటికే ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చిన విద్యుత్ వైర్లు కాలిపోయి ఇళ్లలోని వస్తువులు కూడా కాలిపోయినట్లు స్థానికులు పేర్కొన్నారు. అదే విధంగా ఆల్విన్‌కాలనీ, ఆస్‌బెస్టాస్ కాలనీ, పాపిరెడ్డినగర్, దీనబంధు కాలనీ, ఎల్లమ్మబండ, వెంకట్రావ్ నగర్, హైదర్‌నగర్, భాగ్యనగర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో చెత్తకుప్పలను ఎక్కడ పడితే అక్కడ, రహదారుల్లోని ఇళ్ల ముందే కాల్చివేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు చెత్తా చెదారాన్ని ఎప్పటికప్పుడు కాలనీల్లో పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని, చెత్త కుప్పలకు నిప్పు అంటించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



సాయి ఫంక్షన్ హాల్ వద్ద చెత్తను కాల్చడంతో విద్యుత్ తీగలకు అంటుకున్న మంటలు

పీజేఆర్ నగర్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పీజేఆర్‌నగర్‌లో కోటి రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న చిల్డ్రన్‌పార్కు, మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ పనులను శుక్రవారం కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరికి ఆమోదయోగ్యమైన ఫంక్షన్ హాల్‌ను అన్ని హంగులతో నిర్మిస్తామని తెలిపారు. నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు లోపిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో దొడ్ల రామకృష్ణ గౌడ్, అనిల్ రెడ్డి, వెంకట్ నాయక్, పోశెట్టి గౌడ్, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులు ఈఈ గోవర్ధన్‌రెడ్డి, డీఈఈ రమేష్, ఏఈ శ్రావణి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తదితరులు

పెండింగ్ పనులు పూర్తి చేయాలి

కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి



అధికారులతో సమావేశమైన కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

బాలానగర్: డివిజన్ పరిధిలోని పెండింగ్ పనులను పూర్తి చేయాలని కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న సీసీ, బీటీ రోడ్లతో పాటు దాసరి బస్తీ కమ్యూనిటీ హాల్, కెమికల్ నాలా రిటైనింగ్ వాల్, శ్మశాన వాటిక పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం డీఈ నిఖిల్ రెడ్డి, ఇన్‌చార్జి ఏఈ ఆశ, అసిస్టెంట్ ఏఈ కవిత, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాములు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

మోతీనగర్: శాంతి భద్రతలను కాపాడటం ప్రతి ఒక్కరి కర్తవ్యమని, సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సనత్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్ వి. రామారావు నగర్‌లోని విఘ్నేశ్వర శివపార్వతి ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సుమారు రూ.80 వేలతో ఏర్పాటు చేసిన 10 సీసీ కెమెరాలను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమన్నారు. అలాంటి సీసీ కెమెరాలు ప్రతి ఒక్కరూ తమ బస్తీ, కాలనీల్లో ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదే విధంగా ఆలయాలు, మసీదులు, చర్చిల్లో సైతం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సెక్టార్ ఎస్ఐ హరీష్, బీఆర్‌ఎస్ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు నాగుల సత్యం గంగపుత్ర, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎం. నరసింహ, ఆలయ కమిటీ అధ్యక్షులు సుభాష్ రెడ్డి, సభ్యులు రామకృష్ణ యాదవ్, ప్రధాన కార్యదర్శి సుభాష్ రెడ్డి, సభ్యులు రామకృష్ణ యాదవ్, యాదగిరి, బాలయ్య, సాంబశివ, శివయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



సనత్‌నగర్ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ హరీష్‌ను సన్మానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

ఒక్క సీసీ కెమెరా వెయ్యి కళ్లతో సమానం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, ఏసీపీ హనుమంతరావు

సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి

బాలానగర్: ఒక్క సీసీ కెమెరా వెయ్యి కళ్లతో సమానమని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి అన్నారు. శుక్రవారం బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆదర్శనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 32 సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రజల భాగస్వామ్యం అభినందనీయమన్నారు. అనంతరం బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్ మాట్లాడుతూ.. సమాజ భద్రతలో భాగంగా ప్రతి కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నేర నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకంగా ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, సీఐ టి. నరసింహరాజు, డీఐ నాగిరెడ్డి, ఎస్ఐలు రాంనారాయణ, సరళ, హజీమియా, ఆదర్శనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శంకరయ్య, దుర్గ, ఆంజనేయులు, రవికుమార్, నాగ భూషణం, నాంచారమ్మ, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పీఎస్‌లో ఫీడింగ్‌రూం ప్రారంభించిన సీపీ

జీడిమెట్ల: జీడిమెట్ల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ ప్లే ఏరియా, ఫీడింగ్ రూంను సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి శుక్రవారం ప్రారంభించారు. జీడిమెట్ల పీఎస్‌లో వాక్సన్ ఇంటర్నేషనల్ స్కూల్ సహకారంతో ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ ఏర్పాటు చేశారు. దీనికి తోడు చిల్డ్రన్ ఫీడింగ్ చాంబర్‌ను సైతం ఏర్పాటు చేశారు. ప్రారంభించిన అనంతరం సీపీ మాట్లాడుతూ.. పీఎస్‌కు వచ్చే స్త్రీలకు, వారి పిల్లలకు సౌకర్యంగా ఉండేందుకు రెండు దోహదపడుతాయని అన్నారు. కార్యక్రమంలో బాలానగర్ డీసీపీ కె.సురేష్‌కుమార్, ఏసీపీ హన్మంతరావు, డీఐ కనకయ్య, ఎస్ఐలు ప్రేమ్‌కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాలికల విద్యను ప్రోత్సహించాలి

కార్పొరేటర్ సబిహాబేగం

మోతీనగర్: బాలికల విద్యను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ అల్లాపూర్‌లో శుక్రవారం దార్ ఉల్ అమ్న బాలికల ఇస్లామిక్ పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాలలు వ్యాపార దృక్పథంతో కాకుండా సేవా భావంతో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మహ్మద్ రఫిక్, జాహిద్ షరీఫ్ బాబా, సయ్యద్, నజీర్, నూర్జాన్, జ్ఞానేశ్వర్, అబ్దుల్ సలీం, మల్లికార్జున్, ఖదీర్, కృష్ణ, ముత్యాల దుర్గ పాల్గొన్నారు.

రూ.79.58 కోట్లతో నాలాల విస్తరణ



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యేగాంధీ, కార్పొరేటర్ హమీద్‌పటేల్, జీహెచ్‌ఎంసీ అధికారులు

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఎస్ఎన్‌డీపీ ఫేజ్–2లో భాగంగా రూ.79.58 కోట్ల వ్యయంతో నాలాల విస్తరణ పనులు చేపట్టామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ చెప్పారు. కొండాపూర్ డివిజన్‌లోని గఫూర్‌నగర్ జంక్షన్ నుంచి దుర్గం చెరువు వరకు రూ.11.55 కోట్లతో చేపట్టే వరదనీటి కాలువ నిర్మాణ పనులకు కార్పొరేటర్ హమీద్ పటేల్‌తో కలిసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద ముంపు నుంచి విముక్తి కల్పించేందుకు శాశ్వత చర్యలు చేపట్టామన్నారు. వర్షాకాలం లోపు పనులన్నీ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలం వస్తే ప్రజలకు వరద ఇక్కట్లు తప్పేవి కావని, కంటి మీద కునుకు లేకుండా తీవ్ర ఆందోళనకు గరయ్యేవారన్నారు. రహదారుల నిర్మాణానికి కూడా తగిన ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. అందులో భాగమే లింకురోడ్లు, ప్రధాన రోడ్ల విస్తరణ, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. కాలనీల్లో అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా మార్చడం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచడం వంటి చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎన్‌డీపీ డీఈ రాజు, ఏఈ నిఖిల్, నాయకులు రవిముందిరాజ్, శ్రీనివాస్‌యాదవ్, ఊట్ల కృష్ణ, శ్రీనివాస్‌చౌదరి, తిరుపతిరెడ్డి, తిరుపతి, శ్రావణ్‌యాదవ్, ఊట్ల దశరథ్, రజనీకాంత్, శ్రీనివాస్, నరేష్, అనీల్, వినయ్ పాల్గొన్నారు.

శాస్త్రీయ ఆవిష్కరణలే 'మనూ' లక్ష్యం

ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పీఎఫ్ రహమాన్

రాయదుర్గం: శాస్త్రీయ ఆవిష్కరణలను పెంచడం, విద్యాపరమైన నైపుణ్యాలు విద్యార్థులలో పెంపొందించడమే లక్ష్యంగా ఉర్దూ విశ్వవిద్యాలయం పని చేస్తుందని 'మనూ'ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ పి.ఎఫ్.రహమాన్ అన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం(మనూ)లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్ ఆధ్వర్యంలో 'మనూ'అప్‌లైడ్ ఫిజిక్స్‌లో వస్తున్న మార్పులపై జరిగిన అంతర్జాతీయ సదస్సుకు ఆయన అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనువర్తిత భౌతికశాస్త్రంలో తాజా పరిణామాలను చర్చించేందుకు నిపుణులు, పరిశోధకులు, విద్యావేత్తలను ఒక చోట చేర్చి సమావేశం నిర్వహించే అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. సదస్సులో ఢిల్లీ విశ్వవిద్యాలయం ఫిజిక్స్, ఆస్ట్రోఫిజిక్స్ విభాగ ప్రొఫెసర్ ఎస్ఏహష్మీ, ఢిల్లీ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ ఫిజికల్ సైన్సెస్ ప్రొఫెసర్ మనీష్‌కుమార్, ప్రొఫెసర్ మహ్మద్ రఫీక్ అబుతురాబ్, ప్రొఫెసర్ అలీమ్ హెచ్ భాషా, సదస్సు కన్వీనర్ డాక్టర్ మహ్మద సాదిక్ పాల్గొన్నారు. సదస్సుకు ఏడు దేశాల నుంచి 130 కంటే ఎక్కువ పత్రాలు సమర్పించగా, అందులో 110 పత్రాలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో పలువురు ఫిజిక్స్ ప్రొఫెసర్లు, నిష్ణాతులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వానం అందజేత

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల గ్రామానికి చెందిన మల్లికార్జున స్వామి ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను కలిసి ఈ నెల 26న జరిగే 54వ శివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. 26న తెల్లవారుజాము 4 గంటలకు గంగస్నానం, రాత్రి 7 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 27న మధ్యాహ్నం 12.30 గంటలకు కల్యాణం, మధ్యాహ్నం 2 గంటలకు అగ్ని గుండాలు, బోనాలు, గొర్రెపోతుల బండి ఊరేగింపు, అన్నదానం ఉంటుందని తెలిపారు.

మతిస్థిమితం లేని మహిళ కిడ్నాప్

- ఆటో డ్రైవర్ ఫోన్‌తో అప్రమత్తమైన పోలీసులు
- లైంగికదాడికి పాల్పడి ఉండవచ్చని అనుమానం
- ఇద్దరు నిందితుల అరెస్ట్ ?

మియాపూర్: రోడ్డుపై నిలబడి ఉన్న మతిస్థిమితం లేని మహిళను ఇద్దరు వ్యక్తులు బలవంతంగా బైక్‌పై ఎక్కించుకుని కిడ్నాప్ చేసిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మియాపూర్, బొల్లారం క్రాస్‌రోడ్డులోని బస్టాప్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున మతి స్థిమితం లేని మహిళ(38) నిలబడి ఉంది. అదే సమయంలో అక్కడికి వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఆమెను బలవంతంగా స్కూటీపై ఎక్కించుకుని తీసుకెళ్లారు. దీనిని గుర్తించిన ఓ ఆటోడ్రైవర్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించగా సదరు మహిళను బ్లూ కలర్ స్కూటీపై తీసుకెళ్లినట్లు గుర్తించి రెండు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. ఆ తర్వాత కొద్దిసేపటికి బొల్లారం రోడ్డుపై తిరుగుతున్న ఆమెను గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పలుమార్లు విచారించినా ఆమె వివరాలు చెప్పలేకపోయింది. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. నిందితులు ఆమెపై లైంగిక దాడికి పాల్పడి ఉండవచ్చుననే అనుమానంతో బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కాగా సదరు మహిళ కూకట్‌పల్లికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మతిస్థిమితం కోల్పోయిన ఆమె బస్టాప్‌లలో తలదాచుకుంటూ రోడ్లపై తిరుగుతున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా మియాపూర్ పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

ఆర్నెల్లుగా జీతాల్లేవ

ప్రజలంతా నిద్రలో ఉంటే.. వారు మాత్రం వీధుల్లో విధుల్లో ఉంటారు.. ఊరు తెల్లారేసరికి రోడ్లను అందంగా ముస్తాబు చేస్తారు.. ఇళ్లల్లో వీధుల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని జనావాసాలకు దూరంగా తరలించి రోగాల నుంచి విముక్తి చేస్తారు.. అందరి సంక్షేమం కాంక్షించే వారు మాత్రం సమయానికి జీతాలు చేతికి రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దొరికిన చోట్ల అప్పులు చేసుకుంటూ కాలం వెల్లదీస్తున్నారు. కొన్ని గ్రామాల్లో నెలల తరబడి జీతాలు రాకపోవడంతో సారూ.. జీతాలు లేకుంటే ఎట్లా బతికేదీ.. అంటూ వేడుకుంటున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో



- అర్ధాకలితో కొనాయిపల్లి పంచాయతీ కార్మికులు
- మిగతా 33 జీపీల్లో 3 నెలలుగా అందని వేతనాలు
- పూట గడవడం కష్టమవుతోందని కార్మికుల ఆవేదన
- నగర శివారులో 600 మందికి వేతనాలు లేవు

కొనాయిపల్లి పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు ఆరు నెలలుగా జీతాలు రాకపోగా, ఉద్దమర్రి గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు 4 నెలల నుంచి, మిగతా 32 గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు 3 నెలల నుంచి జీతాలు అందడం లేదు. నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 34 గ్రామ పంచాయతీలు ఉండగా, వీరికి గరిష్టంగా ఆరు నెలల నుంచి మూడు నెలలుగా వేతనాలు అందక వారి కుటుంబాలు అర్ధాకలితో జీవితాన్ని నెట్టుకొస్తున్నాయి. దీంతో కుటుంబ పోషణ భారమై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. వీధులను శుభ్రపరిచే కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడం శోచనీయం. వేతనాలు ఇవ్వాలని వేడుకుంటున్న వారికి.. మన ప్రజాప్రతినిధుల స్పందన ఏవిధంగా ఉంటుందోననే చర్చ సాగుతోంది.

- నూతన పంచాయతీ చట్టం ప్రకారం వీరిని మల్టీ పర్పస్ వర్కర్స్‌గా పిలుస్తున్నారు. ఈ కార్మికులకు సంబంధించిన వేతనాలు ప్రతినెలా వారి ఖాతాల్లో జమ అవుతుంటాయి. గ్రామ పంచాయతీ ఆర్థిక వనరులను బట్టి 8 నెలల నుంచి 3 నెలలుగా వేతనాలు కార్మికుల ఖాతాల్లో జమకాకపోవడం గమనార్హం. జీతాలు అందక వారు పడుతున్న వేదన అంతా ఇంతా కాదు.
- నగర శివారు మేడ్చల్– మల్కాజిగిరి జిల్లాలో గ్రామ పంచాయతీల్లో 600 మంది కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి నెలకు రూ.9.500 చొప్పున రూ.57 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. వీరంతా పారిశుద్ధ్యం, ట్రాక్టర్ డ్రైవర్లు, పన్నుల వసూల్లు, నీటి సరఫరా తదితర విభాగాల్లో పనులు చేస్తున్నారు.

త్వరలో వేతనాలు..

పంచాయతీ కార్మికుల వేతనాల అందకపోవడంతో ఇబ్బందిగా ఉందని సంబంధిత శాఖ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టడంతో పాటు ఆర్థిక సంవత్సరం ముగింపు కారణంగా ఈ సమస్య తలెత్తినట్లు తెలుస్తోంది. త్వరలో వేతనాలు అందుతాయని పంచాయతీ శాఖ అధికారులు భావిస్తున్నారు.

అప్పు చేసి కడుపు నింపుకుంటున్నారు

గ్రామ పంచాయతీ కార్మికులకు ప్రతినెలా అందించే రూ.9,500 జీతం ఇవ్వకపోవడంతో అప్పులతో కాలం గడుపుతున్నాం. స్కూల్ ఫీజు మొదలుకొని నిత్యావసరాలు, కరెంటు బిల్లులు తదితర వాటికి ప్రైవేట్ ఫైనాన్స్‌లో మిత్తికి డబ్బులు తీసుకుని చెల్లించాల్సి వస్తోంది. కార్మిక కుటుంబాల్లో కొందరు పస్తులు ఉండాల్సి వస్తోంది. వేతనాలు సకాలంలో అందించకపోతే పంచాయతీల్లో పనులు నిలిపివేసి ఆందోళనకు దిగుతాం.

– శ్రీనివాస్, జిల్లా గ్రామ పంచాయతీ కార్మిక సంఘం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు